జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com


# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక


చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 21-3-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 281 పేజీలు: 4 వెల : రూ.7

# ఇదేమి శిక్షణ?




* ఫారడే అకాడమీలో చిన్నారుల బాల్యం బంది
* సైనిక్ స్కూల్ శిక్షణ పేరుతో విద్యార్థుల బంది జీవితం
* సీటు వచ్చే వరకు శిక్షణ పేరుతో హింస
* మానసిక ఒత్తిడికి గురవుతున్న చిన్నారులు
* బాల హక్కుల ఉల్లంఘన
* బాలల భవిష్యత్తు ప్రశ్నార్థకం

**శ్రీకాకుళం, మార్చి 20 (వార్త):** విద్యుదయస్కాంత ప్రేరణను కనుగొన్న మైఖేల్ ఫారడే పేరును తగిలించుకుంటే, పిల్లల్లో విద్యుత్తును పుట్టించవచ్చని ఈ కోచింగ్ సెంటర్ వాళ్లు భావించి ఉంటారు. కానీ, ఇక్కడ విద్యుత్తు పుట్టడం లేదు, పిల్లల జీవితాల్లో చీకటి నిండుతోంది. మైఖేల్ ఫారడే పేరును వాడుకుని, విద్యార్థులను బందీలుగా మార్చి, వారి భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. శ్రీకాకుళం నగరంలోని జీటీ రోడ్డు, జేకే సందులో ఉన్న ఫారడే అకాడమీ కోరుకొండ సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల శిక్షణ పేరుతో విద్యార్థులను బందీలుగా మారుస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిరంతరాయంగా శిక్షణ ఇస్తూ, విద్యార్థులను యంత్రాల్లా మార్చేస్తున్నారని బాలల హక్కుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. విద్యార్థులు ఎటువైపు కదలకుండా కేవలం పుస్తకాల వైపే చూసేలా పైనుంచి సీసీ కెమెరాలతో నిరంతరం కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు ఎక్కడ ఉన్నా తన సెల్ ఫోన్ నుంచే పర్యవేక్షిస్తుంటాడు. విద్యార్థులు ఏమాత్రం అటూ ఇటూ మాట్లాడిన వాళ్లకు దండన తప్పడం లేదు. ఈ కోచింగ్ సెంటర్‌లో 6, 9 తరగతుల ప్రవేశ పరీక్షల కోసం 80 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఏడాదికి రూ.60వేలు ఫీజు వసూలు చేస్తున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకుండా, రోజంతా కోచింగ్ సెంటర్లోనే గడుపుతున్నారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిరంతరాయంగా శిక్షణ ఇస్తున్నారు. రోజుకు మూడు పరీక్షలు, ఆరు తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు సరైన విశ్రాంతి, ఆటలు, ఇతర వినోద కార్యక్రమాలు ఉండవు. నిరంతర నిఘా, దండనల వల్ల పిల్లలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.



## బాలల హక్కుల ఉల్లంఘన..

కోచింగ్ సెంటర్లో సరైన మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం లేవు. పరిమిత స్థలంలో 80 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులకు వారి తరగతి పాఠాలపై అవగాహన ఉండడం లేదు. కేవలం బట్టీ పట్టడం, మెథడాలజీ ప్రశ్నలు ప్రాక్టీస్ చేయించడంపైనే దృష్టి సారిస్తున్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం, విద్యార్థులకు ఇష్టమైన రీతిలో చదువుకునే అవకాశం కల్పించాలి. ఫారడే అకాడమీలో విద్యార్థులను బందీలుగా ఉంచి చదివించడం విద్యా హక్కు చట్టానికి విరుద్ధం. విద్యార్థులను మానసికంగా, శారీరకంగా హింసించడం బాలల హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుంది. సరైన సౌకర్యాలు లేకపోవడం, హక్కులు ఉల్లంఘించబడడం వల్ల పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## సీటు వచ్చేంతవరకు శిక్షణ పేరుతో హింస

ఇక్కడ 4వ తరగతి, 5వ తరగతి, 6వ తరగతి విద్యార్థులకు కూడా 3 సంవత్సరాల పాటు కోచింగ్ ఇస్తున్నారు. సీటు వచ్చేంతవరకు శిక్షణ ఇస్తున్నారు. పిల్లల అందమైన బాల్యాన్ని నాశనం చేస్తున్నారు. విద్యార్థులు తమ చిన్నతనపు ఆనందాలను, స్వేచ్ఛను కోల్పోయి, కేవలం పుస్తకాలకే పరిమితమవుతున్నారు. ఇది మరీ దారుణమైన పరిస్థితి, పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలను తీవ్రంగా దెబ్బతీస్తోంది.

## తక్షణ చర్యలకు బాలల హక్కుల సంఘాల డిమాండ్

ఫారడే అకాడమీని మూసివేయాలని బాలల హక్కుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇది నైతిక విలువలకు విరుద్ధమని, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ కోచింగ్ సెంటర్‌పై విచారణ జరిపించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సైనిక్ స్కూల్ ప్రవేశాలకు శిక్షణ ఇచ్చే సంస్థ వివరాలు కూడా పొందుపరచాలి. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉంది. విద్యాశాఖ అధికారులు, బాలల హక్కుల సంఘాలు తక్షణమే స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# మందులోడా.. ఓ మాయలోడా!

* యూనియన్ ముసుగులో ఓ నేత దందా
* 20 ఏళ్లుగా మెడికల్ షాపుల యూనియన్ నేత ఏకఛత్రాధిపత్యం
* తన చెప్పుచేతుల్లోనే కొందరు డ్రగ్స్ కంట్రోల్ అధికారులు
* షాపుల యజమానులు నిలదీస్తే బెదిరింపులు, కేసులు
* పలాసలో మెడికల్ డ్రగ్ మాఫియాకు ఆయనే అండదండ

**శ్రీకాకుళం క్రైం, మార్చి 20 (వార్త):** పలాసలో మెడికల్ డ్రగ్ మాఫీయా అంతా ఆ ఒక్కడి చేతుల్లోనే సాగుతోందన్న విమర్శలు ఉన్నాయి. గత ఇరవై ఏళ్లుగా మెడికల్ షాపుల యూనియన్‌కు నేతగా ఉన్నాడు. డ్రగ్ కంట్రోల్ అధికారులను తన చెప్పుచేతల్లో ఉంచుకుని హవా సాగిస్తున్నాడు. పలాసలో మెడికల్ మాఫియాకు మనోడే కర్త, కర్మ, క్రియ.. అని మెడికల్ షాపుల యజమానులు పలువురు పేర్కొంటున్నారు. 20 ఏళ్లుగా ఈ యూనియన్‌కు ఎన్నికలు జరగలేదంటే మనోడు ఏవిధంగా హవా కొనసాగిస్తున్నాడో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఎవరైనా ఎన్నికలు పెట్టాలని నిలదీస్తే.. ఆధిపత్యంపై ప్రశ్నించిన వారిపై డ్రగ్ కంట్రోల్ అధికారుచే కేసులు పెట్టించడం, బెదిరించడం వంటి చర్యలకు పాల్పడుతుంటాడన్న విమర్శలు ఉన్నాయి. దీంతో అతనితో మనకు వివాదాలు ఎందుకులే అని కొందరు మెడికల్ షాపుల నిర్వాహకులు మిన్నకుంటున్నారు. డ్రగ్ కంట్రోల్ శాఖలోని కొందరు అధికారులు మనోడికి తొత్తుగా ఉంటారని, వారికి నెలవారీ మామూళ్లు షాపుల నిర్వాహకుల నుంచి ఇస్తుంటాడని గుసగుసలు ఉన్నాయి. ఇటీవల పలాసలో డివిజన్ మెడికల్ షాపుల వ్యాపారులతో పలాసలో సమావేశం, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి మూడు జిల్లాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, అధికారులు హాజరయ్యారు. ఈ సమావేశం మనోడి పర్యవేక్షణలో జరిగిందని, దీనికయ్యే ఖర్చంతా కూడా కొందరు మెడికల్ షాపుల నిర్వాహకుల నుంచి కలెక్షన్ చేశాడన్న విమర్శలు వినిపించాయి. మనోడిపై కొందరు వ్యతిరేకంగా ఉన్నారు. వారంతా ఈ సమావేశంలో ఎక్కడ నిలదీస్తారో, తన బండారం బయటపడుతుందోనని భావించి మీడియాకు ఆహ్వానించకుండా గుట్టుచప్పుడు కాకుండా జరిపించేశాడట. గత 20 ఏళ్లుగా ఆయన డ్రగ్ మాఫియా పలాసలో నడుపుతూ తాను ఆడిందే ఆట పాడిందే పాటలా ముందుకుసాగుతున్నాడన్న విమర్శలు ఉన్నాయి.

(పలాస డివిజన్‌లో మెడికల్ షాపుల నుంచి నెలవారీ ఎంతెంత వసూలు చేస్తున్నాడు, ఏవిధంగా బెదిరింపులకు పాల్పడుతున్నాడన్న కథనం త్వరలో జాతీయ వార్తలో వెలువడనుంది)



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ప్రధానమంత్రి యోగా అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం, మార్చి 20(వార్త):** కేంద్ర ప్రభుత్వం (ఆయుష్ శాఖ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, యువజన సర్వీసుల శాఖ వారి ఆదేశాల మేరకు 2వ అంతర్జాతీయ యోగా దినోత్సవమును పురస్కరించకొని, ప్రధానమంత్రి యోగా అవార్డు 2025 కు గాను జాతీయ/అంతర్జాతీయ స్థాయిలో వ్యక్తులు, సంస్థల నుంచి ఆన్లైన్లో నామినేషన్లు / ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నారు. జిల్లాలో అర్హత కలిగిన వ్యక్తులు, సంస్థల వారు దరఖాస్తు చేసుకొనవలసిందిగా తెలియజేస్తూ, వ్యక్తిగత విభాగంలో దరఖాస్తు దారుకు కనీస వయసు 40 సంవత్సరాలు ఉండాలని, 20 సంవత్సరాల అనుభవం కలిగిన వారు అర్హులన్నారు. ఆన్లైన్ నుంచి వచ్చిన దరఖాస్తులు పరిశీలించి జాతీయ స్థాయిలో వ్యకిగతం. సంస్థలు, అంతర్జాతీయస్థాయిలో వ్యక్తిగత, సంస్థలతో కలిపి మొత్తం నాలుగు అవార్డులను జూన్ 21న ప్రదానం చేస్తారని, దరఖాస్తును ఈ నెల 31లోగా https://innovateindia.mygov.in/pm-yoga-awards- పోర్టల్లో నమోదు చేసుకొనవలసిందిగా సెట్ శ్రీ సీఈవో బి.వి.ప్రసాదరావు తెలిపారు.

# పోలీసు సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలి


**-నిబద్ధతతో బాధ్యతగా విధులు నిర్వర్తించాలి**

**-విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి**

**-ఆర్మ్డ్ రిజర్వ్, జిల్లా పోలీసు కార్యాలయం, ఇతర విభాగాల తనిఖీ**



**శ్రీకాకుళం, మార్చి 20(వార్త):** పోలీసు సేవలు ప్రజలకు మరింత చేరువ అయ్యే విధంగా నిబద్ధతతో,బాధ్యతగా విధులు నిర్వర్తించాలని విశాఖపట్నం రేంజ్ డీఐజీ శ్రీ గోపీనాథ్ జట్టి ఐపీఎస్ గారు పేర్కొన్నారు.వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం విశాఖపట్నం రేంజ్ డీఐజీ శ్రీ గోపీనాథ్ జట్టి ఐపీఎస్ గారు ఎచెర్ల అర్మ్డ్ రిజర్వ్ విభాగం, పోలీసు కార్యాలయం, డిసిఆర్బి,స్పెషల్ బ్రాంచ్, పాస్ పోర్టు విభాగాలను సందర్శించి రికార్డులు నిర్వహణ ను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ క్రమంలో ముందుగా విశాఖపట్నం రేంజ్ డిఐజి శ్రీ గోపీనాథ్ జట్టి వారిని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి స్వాగతం పలికి పూల మొక్కను అందజేశారు. అనంతరం ఆర్మ్డ్ రిజర్వు పోలీసులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గార్డు నుండి గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం, జిల్లా పోలీసు కార్యాలయంలోని వివిధ సెక్షన్లు,వివిధ రకాల విధులు నిర్వహించే కార్యాలయ అధికారులు,సిబ్బంది,వారు నిర్వహించే వివిధ రికార్డులను,పోలీసు సిబ్బంది అర్జీలు ,ఉన్నత పోలీసు అధికారులు,కార్యాలయాలతో జరిపే ఉత్తర ప్రత్యుత్తరములను,రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం నుండి వచ్చిన స్టోర్ ఆర్టికల్స్ వివరాలు , రికార్డులు డీఐజీ క్షుణ్ణంగా పరిశీలించారు. అదే విధంగా జిల్లా నేర రికార్డు బ్యూరో, స్పెషల్ బ్రాంచ్, పాస్ పోర్టు సెల్ అధికారులు, సిబ్బంది పని తీరును, రికార్డులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేసారు. జిల్లా సాయుధ దళాల ఆర్మ్డ్ రిజర్వు పోలీసుల పని తీరు,ఆయుధాలు,రికార్డులు, మోటారు వాహనాలు, ఉపయోగం,నిర్వహణ, వాటి పని తీరు, రికార్డులు నిర్వహణ తనిఖీ చేసి జిల్లా పోలీసుల సంక్షేమానికి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను డిఐజి గోపినాథ్ జట్టి అడిగి తెలుసుకొని, విధులు నిర్వహణ, పని తీరు పై సంతృప్తిని వ్యక్తం చేసారు. జిల్లా ప్రగతిని, పోలీసుల సంక్షేమానికి పోలీసుశాఖ చేపడుతున్న కార్యక్రమాలను,పోలీసు సిబ్బంది, కార్యాలయం సిబ్బంది పనీ తీరు జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి, డిఐజి గోపినాథ్ జట్టి వారికి వివరించారు.ఈ వార్షిక తనిఖీల్లో జిల్లా ఎస్పీ శ్రీ కెవి మహేశ్వర రెడ్డి, అదనపు ఎస్పీ కెవి రమణ,ఎఆర్ డిఎస్పీ ఎల్.శేషాద్రి, టౌన్ డీఎస్పీ వివేకానంద,డిపిఓ ఎఓ గోపినాథ్, స్పెషల్ బ్రాంచ్ సిఐ ఇమ్మాన్యూల్ రాజు,డిఎస్పీ ఆర్.శ్రీనివాస రావు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



## పాసింజర్ జట్టీ పూర్తి చేయించండి


**శ్రీకాకుళం, మార్చి 20(వార్త):** గార మండలం కళింగపట్నం పాసింజర్ జట్టి కింద ఎంపిక జరిగి కేంద్ర ప్రభుత్వం 2016లో గుర్తించి కేంద్రం నుండి పది కోట్ల రూపాయలు మంజూరు చేస్తే గత వైయస్సార్ ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఖర్చు చేయకుండా కాలయాపన చేసిందని శ్రీకాకుళం నియోజకవర్గ శాసన సభ్యులు గొండు శంకర్ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. దానికి సంబంధించి డిపిఆర్ ఇచ్చి కేంద్రానికి సిఫార్సు లేక రాయవలసిందిగా ముఖ్య మంత్రిని కోరారు. వెంటనే చంద్రబాబునాయుడు స్పందించి సీఎస్ రవిచంద్రకి అప్పగించి, ఈ విషయం కేంద్రానికి లేఖ రాయమని ఆదేశించారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించడంతో శంకర్ ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీకాకుళంలో డ్రోన్ నిఘా



**శ్రీకాకుళం, మార్చి 20(వార్త):** శ్రీకాకుళం రెండవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో గల బైర్వని పేట, శాంతినగర్ కాలనీ, నాగావళి నది పరివాహక ప్రాంతాలు, పట్టణ చివర ప్రాంతాలలో నిర్మానుష్యమైన ప్రదేశాలలో గురువారం డ్రోన్ కెమరా నిఘా పెట్టి,చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై డ్రోన్ నిఘా అపెట్టడం జరిగింది. జిల్లా ఎస్పీ శ్రీ కేవీ మహేశ్వర్ రెడ్డి ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు రెండవ పట్టణ చివర ప్రాంతాలలో బహిరంగంగా మద్యం సేవించడం ,గంజాయి సేవించడం,పేకాట, ఈవిటిజింగ్, చైన్ స్నాచింగ్ తడితర నేరాలు పై డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టీ పాడుపడిపోయిన బంగ్లాలు, నివాస గృహాలు పై డ్రోన్ కెమెరాలతో బహిరంగంగా మద్యం సేవించడం గంజాయి సేవించడం వారు పట్టుబడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరిగింది. డ్రోన్ నిఘా తో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టు వేయడం జరగుతుంది.

## జీడి, టేకుతోట దగ్ధం



**మెళియాపుట్టి, మార్చి 20(వార్త):** మెళియాపుట్టి నుంచి పెద్ద పద్మాపురం వెళ్లే రహదారిలో గల మాడుగుల రమేష్కి చెందిన సుమారు 7 ఎకరాలు జీడి,టేకు తోట గురువారం అగ్ని ప్రమాదానికి గురై దగ్ధమైంది. తోట నుంచి 12 గంటల ప్రాంతంలో మంటలు, పొగ వస్తుండడంతో ఆ దారి వెంబడి వెళ్లే వారు చూసి సంబంధిత రమేష్ కు తెలియజేయడంతో వారు అక్కడికి చేరుకుని స్థానికులు సహకారంతో కొంతవరకు మంటల్ని అదుపు చేయడంతో పాటు వెంటనే టెక్కలి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు సైతం సకాలంలో వచ్చి సుమారు రెండు గంటలు సమయంలో మంటల్ని నిలువురించగలిగారు. సుమారు లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగిందని అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు. మంటలు ఎలా వ్యాపించింది తెలియరావలసి ఉంది.

## చిన్నారుల కూచిపూడి నాట్యం

**ఇచ్ఛాపురం, మార్చి 20(వార్త):** రసవత్తరంగా సాగిన చిన్నారుల కూచిపూడి నాట్యంమఖరామా పురం షిరిడీ సాయి బాబా ఆలయం 18వ వార్షికోత్సవం సందర్భంగా జరిగింది. నాట్యగురువు శృతి ,కావ్య ,పూజ, జయ ,శ్వేతా చిన్నారులు ప్రీతీ, నిహారిక, రియా, శ్రీయ ,సంజన, స్రవంతి, ప్రణవి, తనుశ్రీ, రమ్య, నిఖిత, జాహ్నవి, జైత్రి ,పల్లవి, మధుశ్రీ, దీపిక పాల్గొన్నారు. అకాడమీ అధ్యక్షులు చిన్నా గురుస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం రసవత్తరంగా సాగింది. పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త రమణసాయి పూజ కమిటీ చిన్నారులను, చిన్నా గురు స్వామిని సత్కరించారు.



# స్కూల్ కాంప్లెక్స్ నిధులు సక్రమంగా వినియోగించాలి



**ఇచ్ఛాపురం, మార్చి 20(వార్త):** మండల విద్యా మండల కేంద్రంలో ఏడు సముదాయ కేంద్రాల చైర్మన్లు, సెక్రటర్లు, సి అర్ టి లకు ఎంఈఓ ఎస్.విశ్వనాథం అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించడమైనది. ఈ సమావేశంలో కాంప్లెక్స్ నిర్వహణకు సంబంధించి నిధులను ఏ విధంగా వినియోగించుకోవాలో కూలంకుషంగా ప్రతి కాంప్లెక్స్ చైర్మన్ లకు , సెక్రటరీలకు వివరించడమైనది. మండలంలో ఏడు కాంప్లెక్సుకు ఒక్కొక్క దానికి లక్ష రూపాయలు నిధులు కాంప్లెక్స్ నిర్వహణ కోసం కాంప్లెక్స్ ఖాతాలో జమ అవుతున్నాయని ఎంఈఓ విశ్వనాథం వివరించారు.

ఈ నిధులను సముదాయ సమావేశ నిర్వహణకు, పాఠశాలకు కావలసిన టిఎల్ఎం గ్రాంట్ కొనుగోలుకు వినియోగించి మెరుగైన సముదాయ సమావేశములు నిర్వహించి, పాఠశాలలు బలోపేతానికి కృషి చేయాలని ఎంఇఓ కురమాన అప్పారావు సూచించారు. కార్యక్రమంలో ఇరువురు ఎంఇఓలు ఏడు సముదాయ కేంద్రాల చైర్మన్లు, సెక్రెటరీలు, సి అర్ టి లు, ఎం అర్ సి సిబ్బంది పాల్గొన్నారు.

# గేట్లో ఆర్జీయూకేటీ విద్యార్థులకు ర్యాంకుల పంట

**-విద్యార్థుల నడుమ కేక్ కట్ చేసిన డైరెక్టర్ బాలాజీ**

**- పట్టుదల, కృషి విజయానికి కారణమని ప్రశంస**



**శ్రీకాకుళం, మార్చి 20(వార్త):** శ్రీకాకుళంలో గేట్-2025లో ర్యాంకులు కైవసం చేసుకున్న విద్యార్థిని విద్యార్దుల మధ్య కేక్ కట్ ఆనందం వ్యక్తం చేశారు. మీ పట్టుదల, కృషి విజయానికి కారణం అని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం డైరక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ అన్నారు. రాజీవ్ గాంధి వైజ్ఞానిక సాంకేతికవిశ్వ విద్యాలయంలో శ్రీకాకుళం క్యాంపస్ గేట్-2025లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం శ్రీకాకుళం క్యాంపస్ లో విద్యార్థిని విద్యార్దులు కొమరాల శ్వేత శ్రీ 241, అప్పన్న శ్రీనివాస్ 663 ర్యాంక్ లను కైవసం చేసుకున్నారు. ఇంకా సుమారుగా 60 మంది విద్యార్దులకు మంచి ర్యాంక్లు రావడపై సంతృప్తి వ్యక్తం చేయడమే కాకుండా విద్యార్థినీ విద్యార్థుల మధ్య కేక్ కట్ చేస్తూ విజయోత్సవ సంబరాలు నిర్వహించుకున్నారు.డైరక్టర్ కొక్కిరల వెంకట గోపాల ధన బాలాజీ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు ప్రత్యేక సూచనలు చేస్తూ ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. శ్రీకాకుళం పరిపాలనా అధికారి ముని రామ కృష్ణ మాట్లాడుతూ ఇటువంటి విజయోత్సవాలను ప్రతి సంవత్సరం జరుపుకునేలా విద్యార్థినీ విద్యార్థులు కష్టపడి చదివి పోటీ పరీక్షలలో మంచి ఫలితాలు యూనివర్సిటీకి మంచి పేరు తేవాలన్నారు

ఈ కార్యక్రమంలో డీన్. మోహన్ కృష్ణ చౌదరి, ఎఫ్.వో. వాసు, వెల్ఫేర్ స్టూడెంట్ డీన్ గేదెల రవి, సీఎస్ఇ విభాగపతి రమేష్ కుమార్,వివిధ డిపార్ట్మెంట్స్ విభాగపతులు, అధ్యాపకులు విద్యార్థులు అభినందనలు తెలిపారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మరిన్ని సదుపాయాలు కల్పించాలి

**శ్రీకాకుళం, మార్చి 20(వార్త):** విజయవాడ శాసనమండలి వద్ద మీడియా పాయింట్ వేదికగా ఉద్దాన ప్రాంతంలో ఉన్న కిడ్నీ సమస్యల పైన ఎమ్మెల్సీ నర్తు రామారావు గురువారం తన గళం విప్పారు. రూ.700 కోట్ల ఖర్చుపెట్టి ఉద్దానం ప్రాంతానికి తాగునీరు తీసుకువచ్చామని, రూ.79 కోట్లతో 200 పడకలతో పలాసలో కిడ్నీ రీసెర్చ్ కేంద్రాన్ని నిర్మించామన్నారు. కూటమి ప్రభుత్వం, కిడ్నీ రోగులను ప్రస్తుతానికి గాలికి వదిలేసిందని ఆరోపించారు. ఇచ్ఛాపురంలో డయా లసిస్ కేంద్రం తక్షణమే ప్రారంభించాలని, కవిటిలో డయాలసిస్ యూనిట్లు పెంచాలని, పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ద్వారా మరింత వైద్య సదుపాయాలు సమకూర్చాలని, పెన్షన్‌ను రూ.15వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.



## మిషన్ వాత్సల్యను ప్రోత్సహించాలి

**పలాస, మార్చి 20(వార్త):** పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో గురువారం అన్ని సచివాలయంల ఉమెన్ ప్రొటెక్షన్ కార్యదర్శులతో కమిషనర్ నడిపేన రామారావు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వం వారు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య ప్రోగ్రాంను ప్రజలలోనికి తీసుకువచ్చి అందరికీ తెలిసేటట్లు అమలు చేయవలసిన బాధ్యత మీ అందరిపై ఉన్నదని చెప్పారు. బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలన, బాల్యవివాహాలు అరికట్టడం, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టడానికి తల్లి దండ్రులను చైతన్యవంతం చేయడం మరియు ప్రతివారం పురపాలక సంఘం పరిధిలో గల పాఠశాలలను సందర్శించి బాలికలతో సమావేశాలను ఏర్పాటు చేసి ప్రభుత్వం పట్ల, చట్టాల పట్ల బాలికలను చైతన్యవంతులుగా చేయవలసినదిగా కమిషనర్ తెలియజేశారు. ఇంకనూ తల్లి, తండ్రి లేని పిల్లలను గుర్తించి వారికి ప్రభుత్వం వారినుండి ప్రతినెలా వచ్చే 4,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని, పిల్లలు మరియు వారి సంరక్షకుల పేర్లపై జాయింట్ అకౌంట్ ను బ్యాంకు లో తెరిచి వారికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా మీరందరూ కృషి చేయ గలరని ఈ సందర్భంగా కమిషనర్ తెలియజేశారు.

## రేషన్ కార్డుదారులు.. 31లోగా ఈ కేవైసీ చేయించుకోవాలి

**శ్రీకాకుళం, మార్చి 20(వార్త):** జిల్లాలో ఉన్న 6,60,730 రేషను కార్డులలో 19,39,082 మంది కుటుంబ సభ్యులకు గాను 17,39,959 మంది కుటుంబ సభ్యులకు ఈ కేవైసీ పూర్తి చేసి మిగిలిన 1,99,123 మంది కుటుంబ సభ్యులకు ఇంకనూ పూర్తి చేయవలసి యున్నది. గౌరవ సుప్రీం కోర్ట్ వారి ఆదేశముల మేరకు ఈ ప్రక్రియ ఈ నెల 31 వ తేది లోగా పూర్తి చేయవలెను . ప్రభుత్వ పథకాలు పొందడానికి రేషన్ కార్డులలో ఉన్న ప్రతి కుటుంబ సభ్యులు (5 సంవత్సరంలలోపు వయస్సు ఉన్నవారు మినహా ) ఈ కేవైసీ చేయించుకొనవలసిన అవసరం ఎంతైనా ఉంది . ఈ కేవైసీలో నమోదు కాని వారి వివరములు రేషను డీలర్ , గ్రామ రెవిన్యూ అధికారి , తహసిల్దారు e.PDS siteనందు ఈ పాస్ విధానం ద్వారా GSWS Mobile Appద్వారా తెలుసుకొని నమోదు చేసుకోన వచ్చును. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంత ఒకే e.PDS విధానం ఉన్నందున వేరే ప్రాంతములో ఉన్న పౌరులు కూడా వారి రేషన్ కార్డు నెంబరు ఉపయోగించి ఈ కేవైసీ నమోదు చేసుకొనుటకు వీలు ఉన్నది. రేషన్ కార్డులో ఉన్న లబ్దిదారులకు గ్రామములోని రేషను డీలరు ద్వారా గాని, గ్రామ రెవిన్యూ అధికారి ద్వారాగాని , తహసిల్దార్ కార్యాలయములో గాని ఈ కేవైసీ నమోదు చేయవలసినదిగా సంబంధిత అధికారులకు ఆదేశములు ఇవ్వడము జరిగినది. మార్చి 31వ తేది లోపు ఈ కేవైసీ నమోదు కాని లబ్దిదారులకు రేషను సరఫరా నిలిచిపోయే అవకాశము ఉన్నందున సదరు లబ్దిదారులు గడువు లోపు ఈ కేవైసీ నమోదు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్లాస్టిక్ అక్రమ అమ్మకాలు అరికడదాం

**పలాస, మార్చి 20(వార్త):** పలాస జంట పట్టణాల్లో అక్రమ ప్లాస్టిక్ అమ్మకాల నివారణకు చర్యలు తీసుకున్న, ఫలితము లేకుండా పోయిన్దని మున్సిపల్ కమీషనర్ ఎన్ రామారావు తెలిపారు. ఈ మేరకు తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. నెల రోజులుగా పలాసలో అక్రమ ప్లాస్టిక్ అమ్మకాలను అరికట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్యారీ బ్యాగులు, 75 మైక్రానుల మందం కన్నా తక్కువున్న ప్లాస్టిక్ వస్తువులు, ప్లాస్టిక్ బాటిళ్లు, ఇయర్ బడ్స్, పుల్లలు, జెండాలు, ఐస్‌క్రీమ్ పుల్లలు, డెకరేషన్‌కు వినియోగించే థర్మోకోల్ షీట్లు, ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, ఫోర్క్స్, చెంచాలు, స్ట్రాలు, స్వీటు బాక్సులు, సిగరెట్ పెట్టెలకు చుట్టే కవర్లు, ప్లాస్టిక్ ఆహ్వాన పత్రికలు, పీవీసీ బ్యానర్లు వంటి వస్తువులపై నిషేధం వర్తిస్తుందన్నారు.

## ఆక్రమణలపై "స్పెషల్ డ్రైవ్"

**ఇచ్ఛాపురం, మార్చి 20(వార్త):** మున్సిపల్ మరియు పోలీస్ శాఖలు సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వీధి వర్తకులు, వ్యాపారులు పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన స్థలాలను ఆక్రమణ చేసి దుకాణాలు ఏర్పాటు చేయడం వలన మున్సిపాలిటీ లో వాహనాల పార్కింగ్ సమస్య తలేత్తుతుంది.పార్కింగ్ స్థలానికి అక్రమణ చేయకుండా దాసన్న పేట కూడలి, టైలర్ రోడ్డు, రథం వీధి మరియు బస్సు స్టాండ్ లో అవగాహనా కార్యక్రమం చేపట్టారు, చట్టాని అతిక్రమిస్తే తీవ్రమైన చర్యలు తప్పవని ఇచ్ఛాపురం టౌన్ యస్.ఐ ముకుంద రావు మరియు టౌన్ ప్లానింగ్ అధికారి యస్. వినయ్ ప్రసాద్ స్పష్టం చేసారు..ఈ కార్యక్రమం లో పోలీసులు మరియు టౌన్ ప్లానింగ్ సెక్రెటరీలు పాల్గొన్నారు.



# ఘనంగా కళావతమ్మ ప్రథమ వర్ధంతి

***హాజరైన కేంద్ర, రాష్ట్ర మంత్రులు**
***నిమ్మాడ ఘాట్ వద్ద నివాళులర్పించిన కింజరాపు కుటుంబసభ్యులు**
***మాతృమూర్తి అందించిన స్ఫూర్తితో ముమ్ముందుకు**
***మంత్రి అచ్చెన్నాయుడు**
***భావోద్వేగానికి లోనైన కుటుంబసభ్యులు**
***తరలివచ్చిన అభిమాన గణం, టీడీపీ శ్రేణులు**

కోటబొమ్మాళి, **మార్చి 20(వార్త):** రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాతృమూర్తి కళావతమ్మ ప్రథమ వర్ధంతిని నిమ్మాడ ఘాట్ లో గురువారం ఘనంగా నిర్వహించి, ఆమెకు నివాళులర్పించారు. మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు ఆయన సోదరులు కోటబొమ్మాళి మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ ఓఎస్డీ కింజరాపు ప్రభాకర్‌రావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. దివంగత నేత ఎర్రన్నాయుడు గారి సతీమణి విజయమ్మ నివాళులర్పించారు. మనవడు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రివర్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, కుటుంబ సభ్యులు ఆమెతో తమకున్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కళావతమ్మ స్ఫూర్తి అందుకుని నిమ్మాడ అభివృద్ధికి అలానే జిల్లా అభివృద్ధికీ పని చేస్తామని అన్నారు. కుటుంబాన్ని ఏకతాటిపై నడిపి, అన్న ఎర్రన్న మరణం తరువాత కూడా అదే విధంగా అందరి మధ్య అనుబంధాలను నిలిపి, ఒక గొప్ప మనిషిగా నిలిచిన వైనం తమకొక నిత్య స్మరణీయం అని అచ్చెన్నాయుడు భావోద్వేగం అయ్యారు.

అతి సాధారణ కుటుంబం నుంచి అసాధారణ విజయాలు అందుకున్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఇవాళ తామంతా అసాధారణ విజయాలు అందుకునేందుకు కారణం తమ మాతృమూర్తి కళావతమ్మ అన్నారు. ఇవాళ కింజరాపు కుటుంబాన్ని నమ్ముకుని వేల కుటుంబాలు ఉన్నాయని, వారికి మేలు చేయడం,వారి ఉన్నతికి పాటుపడడం తమ ప్రథమ కర్తవ్యం అని వెల్లడించారు. కొడుకులు, కూతుళ్లు, మనవలు మనవరాళ్లు ఇలా అందరి విజయాలను చూసి, అందరి ఉన్నతిలో భాగం అయి ఆమె చిరాయువు అని కొనియాడారు. తొలుత కింజరాపు కుటుంబ సభ్యులు ఆధునికీకరణ చేసిన కళావతమ్మగారి ఘాట్ లో పుష్పాంజలి ఘటించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలి వచ్చిన ప్రజలు కళావతమ్మకు నివాళులర్పించేందుకు జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలి వచ్చిన ప్రజలు, నిమ్మాడ ఘాట్ వద్దకు చేరుకుని నివాళులర్పించారు. కళావతమ్మతో తమకున్న అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు.







జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ధర్మరాజు నేత్రాలు సజీవం



**శ్రీకాకుళం, మార్చి 20(వార్త):** శ్రీకాకుళంలోని విశాఖ ఏ కాలనీకి చెందిన పొట్నూరు ధర్మరాజు (71) గురువారం మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబసభ్యులు వారి నేత్రాలను దానం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని రెడ్ క్రాస్ చైర్మన్ జగన్మోహనరావుకు తెలియజేసారు. మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ఐ టెక్నీషియన్ పూతి .సుజాత , సుమతి ఆయన కార్నియాలు సేకరించి విశాఖపట్నంలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. ఆయన మృతికి సంతాపం తెలియజేస్తూ దాత కుటుంబ సభ్యులను రెడ్ క్రాస్ ఛైర్మన్ జగన్మోహనరావు,సెక్రటరీ మల్లేశ్వరరావు గారు, ట్రెజరర్ దుర్గా శ్రీనివాస్ ఇతర సభ్యులు అభినందించారు. ప్రస్తుత కాలంలో నేత్రదానం పై అవగాహన,చైతన్యం ప్రజల్లో బాగా పెరుగుతుందని, ఈ విధంగా నేత్రదానం ద్వారా మరొకరికి ఈ ప్రపంచాన్ని చూసే అవకాశం కలుగుతుందని, అంధత్వ రహిత సమాజ స్థాపనకు యువత,ప్రజలు కృషి చేయాలని అన్నారు.నేత్ర దానం చేయాలనుకునే వాళ్ళు 7842699321కు కాల్ చేయాలని కోరారు.

# గంజాయి వ్యాపారుల ఆస్తులు జప్తు చేస్తాం

*** గంజాయి రవాణా, సరఫరా, వినియోగానికి పాల్పడితే చట్టపరంగా శిక్షిస్తాం * 8 నెలల్లో గంజాయి సమూల నిర్మూలనకు చర్యలు * 7378 కిలోల గంజాయి నిర్వీర్యం* విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి**





**శ్రీకాకుళం, మార్చి20 (వార్త):** విశాఖపట్నం రేంజ్ పరిధిలో గడిచిన ఎనిమిది నెలల్లో గంజాయి సమూల నిర్మూలనకు కఠిన చర్యలు చేపట్టడంతోపాటు, వాటి మూలాలను గుర్తించి బాధ్యులైన వారిని కూడా నిందితులుగా చేర్చామని, గంజాయి అక్రమ వ్యాపారాలలో ఆస్తులు కూడబెట్టిన వ్యక్తులను గుర్తించి, వారి ఆస్తులను జప్తు చేస్తున్నామని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి తెలిపారు. గురువారం శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం పాత కుంకాం గ్రామంలో మూడు జిల్లాల్లో వివిధ కేసుల్లో సీజ్ చేసిన గంజాయిని నిర్వీర్యం చేసేందుకు చేపట్టిన కార్యక్రమంలో విశాఖ రేంజ్ డీఐజీ పాల్గొన్నారు. 226 గంజాయి కేసులలో సీజ్ చేసిన 7378 కిలోల గంజాయిని డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వీర్యం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసై అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 226 కేసులలో 7378 కేజీల గంజాయిని శాస్త్రీయ పద్ధతిలో నిర్వీర్యం చేశామన్నారు. 2025 సంవత్సరంలోని రేంజ్ పరిధిలో మొదటి దశలో అనకాపల్లి జిల్లాలో జనవరి నెలలో 34,419 కేజీల గంజాయి, 39.4 లీటర్ల హాషిష్ ఆయిల్, రెండవ దశలో ఏఎస్ఆర్ జిల్లాల్లో ఫిబ్రవరి నెలలో 3075 కేజీల గంజాయిని, 25.5 లీటర్ల హాషిష్ ఆయిల్ నిర్వీర్యం చేయడం జరిగిందన్నారు. మూడువ దశలో శ్రీకాకుళంలో డిస్పోజెల్ చేస్తున్నామన్నారు. ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయి అక్రమ రవాణా జరుగుతుందని గుర్తించామన్నారు. 24 అంతర్ రాష్ట్ర సరిహద్దుగా, 15 జిల్లాల సరిహద్దుగా ప్రధాన చెక్ పోస్టులను ఏర్పాటు చేసి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయాలకు అనుసంధానం చేయడం జరిగిందన్నారు. గంజాయి సాగుని నియంత్రించేందుకు ప్రత్యామ్నాయ పంటల గాను 4.68 ప్లాంట్లో 22 రకాల విత్తనాలను 11 ఎకరాలకు రబి సీజన్లో రైతులకు అందజేమన్నారు. ప్రత్యామ్నాయ పంటలలో భాగంగా 20 మండలాల్లో 10,256 రైతులు పంటలను పండించేందుకు మొగ్గు చూపుతున్నారు అని తెలిపారు. అదే విధంగా రాజ్మా చిక్కుడు విత్తనాలు 4496 కింటాలు విత్తనాలు పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. డ్రోన్ కెమెరాల నిఘా ఏర్పాటు చేసి 327 గ్రామాల్లో 90 ఎకరాలు గంజాయి సాగుని గుర్తించి నిర్వీర్యం చేయడం జరిగిందని తెలిపారు. గంజాయి సాగుకి పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నామన్నారు. గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న 34 అంతర్ రాష్ట్ర ముఠాలను, 21 అంతర్ జిల్లాల ముఠాలను పట్టుకున్నామన్నారు. అందులో ఏపీకీ చెందిన 467 మంది ఉన్నారని చెప్పారు. వీరిలో 49 మందిపై పిడి యాక్టు, 1031 నిందితులపై గంజాయి సస్పెక్ట్ షీట్స్ తెరవడం జరిగిందని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో కళాశాలలో డ్రాప్ బాక్స్ ను ఏర్పాటు చేసి మత్తు పదార్థాల యొక్క సమాచారాన్ని ఇచ్చే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. 23 గంజా కేసుల్లో 40 మంది న్యాయ స్థానాల్లో శిక్షలు ఖరారు కాగా, సుమారు 20మందికి 20 సంవత్సరాలు కఠిన కారాగార శిక్షలు పడ్డాయని తెలిపారు. పెండింగ్లో ఉన్న కేసులను వీలైనంత త్వరగా ట్రైల్ జరిగే చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి అక్రమ రవాణా ద్వారా ఆస్తులు సంపాదించిన వారి అక్రమ సంపదని చట్ట ప్రకారం జప్తు చేయడం జరుగుతుందని, ఇప్పటికే అనకాపల్లి జిల్లాలో ఒక్క కేసులోను, విజయనగరం జిల్లాలో మరో కేసులో ఆస్తులు జప్తు చేయడం జరిగిందన్నారు. రేంజ్ పరిధిలో గంజాయి వినియోగిస్తూ పట్టుబడిన 86 మందిని డి-అడిక్షన్ కేంద్రాలకు పంపించి కౌన్సెలింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి, విజయనగరం అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, పార్వతీపురం మన్యం జిల్లా ఏఎస్పీ అంకిత సూరన, శ్రీకాకుళం అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## గ్యాస్ డెలివరీ చార్జీలు చెల్లించొద్దు

**శ్రీకాకుళం, మార్చి 20(వార్త):** ఇటీవల జిల్లాలోని కొన్ని ప్రాంతములలో జిల్లా కలెక్టరు వారి పర్యటన సందర్భంగా ప్రభుత్వ కార్యక్రమాలు మరియు సంక్షేమ పథకాలు అమలు తీరుపై చర్చించినప్పుడు పొందూరు మండలములోని పొందూరు గ్రామములో, శ్రీకాకుళం మండలంలోని కొత్తపేట గ్రామంలో, కొంతమంది గ్యాస్ వినియోగదారులు తమ నుంచి గ్యాస్ డెలివరీ చెయ్యు వ్యక్తి రసీదులో ఉన్న మొత్తం కంటే అదనంగా రూ. 20/- నుంచి రూ. 50/- రూపాయలు వసూలు చేయ్యుచున్నట్లు ఫిర్యాదులు చేసి ఉన్నారు. సదరు విషయమై విచారణ చేపట్టగా అధిక మొత్తము వసూలు చేయుట వాస్తవం అని నిరూపణ అయింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్యాస్ ఏజెన్సీ నుండి వినియోగదారులు ఇంటికి 15 కిలోమీటర్ల పైన దూరం ఉన్నచో రవాణ చార్జి నిమిత్తం ఒక్కో సిలిండర్ కు రూపాయలు 30/- మాత్రమే వసూలు చేయడానికి వీలు ఉన్నది. 15 కిలోమీటర్ల లోపు దూరం ఉన్నచో వినియోగదారులు గ్యాస్ సరఫరా చెయ్యు వ్యక్తికి ఎటువంటి అదనపు మొత్తం చెల్లించవలసిన అవసరం లేదు, గ్యాస్ రసీదు నందు ఉన్న మొత్తము మాత్రమే చెల్లించవలెను. గ్యాస్ సరఫరా చేయు వ్యక్తికి గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం నిబంధన మేరకు జీతం చెల్లిస్తుందన్న మరియు రవాణా చార్జీల కొరకు ఆయిల్ కంపెనీ వారు గ్యాస్ డీలర్ కు రవాణా ఖర్చులు చెల్లిస్తున్నందున 15 కిలోమీటర్ల లోపు నివాసం ఉన్న వినియోగదారులు ఎవరు గ్యాస్ సరఫరా చేయు వ్యక్తికి రసీదు నందు ఉన్న మొత్తం కంటే అదనపు మొత్తం చెల్లించరాదు. ఎవరైనా గ్యాస్ డెలివరీ చేయి వ్యక్తి అదనపు మొత్తం డిమాండ్ చేసినా, అదనపు మొత్తం చెల్లించని వినియోగదారునికి ఏమైనా ఇబ్బందులు పెట్టినా సంబంధిత పౌరసరఫరాల డిప్యూటీ తాసిల్దారు వారికీ గానీ మండల తాసిల్దార్ వారికీ గాని లేదా జిల్లా పౌర సరఫరా అధికారి వారికీ కి గానీ ఫిర్యాదు చేయవచ్చును. ఈ విషయమై జిల్లాలోని గ్యాస్ డీలర్లు అందరికీ తగు సూచనలు ఇస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకొనుట జరుగును అని హెచ్చరించడం జరిగినది. కావున జిల్లాలోని గ్యాస్ వినియోగదారులందరూ తమ గ్యాస్ సిలిండర్ డెలివరీ విషయమై తగు అప్రమత్తంగా ఉండాల్సిందిగా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఒక ప్రకటనలో కోరారు.

## నిమ్మాడలో చోరీ

**సంతబొమ్మాళి/కోటబొమ్మాళి, మార్చి 20 (వార్త):** నిమ్మాడలో గురువారం పట్టపగటే గుర్తుతెలియని వ్యక్తులు అదే గ్రామానికి చెందిన శిమ్మ క్రిష్ణారావు ఇంట్లో చోరికి పాల్పడ్డారు. అక్కడకు కూతవేటు దూరంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తల్లి ప్రథమ వర్ధంతి నిర్వహించటం, జనసంద్రం, పోలీస్ పహరా మధ్యలో పట్టపగలే చోరి జరగడంతో సర్వాత్రా ఉత్కంఠకు గురి చేసింది. 11 గంటల సమయంలో శిమ్మ కృష్ణారావు కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్ళిన సమయంలో అదును చేసి చోరికి పాల్పడడం చర్చనీయాంశమైంది. చోరిలో అరున్నర తులాలు అపహరణకు గురైనట్లు కుటుంబసభ్యులు చెబుతున్నారు. తాము బయటనుంచి వచ్చి సరికి తామే వేసిన తాళం తీసి ఉందని, ఇంటిలోపలకి వెళ్ళి చూడగా బీరువ తాళం తెరిచి ఉండటం, అందులో ఉన్న ఆరున్నర తులాలు బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు లబోదిబోమ న్నారు. అక్కడే ఉన్న పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ధర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్న ట్లు స్థానిక ఎస్ఐ సత్యన్నారాయణ తెలిపారు.

# మహిళల భద్రతకు శక్తి అస్త్రం

*** ఏపీలో 'శక్తి' యాప్ ఉమెన్ ప్రొటెక్షన్ వింగ్‌కు శ్రీకారం * మహిళలు, విద్యార్థినులకు ఈ యాప్‌పై అవగాహన**



**శ్రీకాకుళం, మార్చి 20 (వార్త):** మహిళలు, బాలికల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. మహిళా దినోత్సవం రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు 'శక్తి' యాప్ ఉమెన్ ప్రొటెక్షన్ వింగ్ పేరుతో ప్రారంభించారు. ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేకమైన యాప్‌ను రూపొందించి, వారి రక్షణ చర్యలకు శ్రీకారం చుట్టింది. శ్రీకాకుళం జిల్లాలోని పోలీసు సబ్ డివిజన్ పరిధిలో శక్తి పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ఎస్పీ పర్యవేక్షణలో ఈ శక్తి బృందాలు విధులు నిర్వహిస్తున్నాయి. ప్రతి బృందంలో ఒక మహిళా సీఐ లేదా ఎస్సై సారథ్యంలో ఇద్దరు మహిళలు, నలుగురు పురుష సిబ్బంది ఉంటారు. శక్తి బృందాలు కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించింది. మహిళలు, యువతులు ఖచ్చితంగా తమ మొబైల్ ఫోన్లలో ఈ శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా ఆయా బృందాలు జిల్లా పరిధిలోని ఆయా పట్టణాలు, నగరంలో అవగాహన కార్యక్రమాలు ప్రారంభించారు. కళాశాలలు, బస్టాండ్లు, రద్దీ కూడళ్లలో ఉండే ప్రాంతాల్లో శక్తి బృందం సభ్యులు వారికి యాప్ గురించి వివరిస్తున్నారు. రాత్రి పూట ఒంటరిగా ఎక్కడైనా చిక్కుకున్నా.. ఆకతాయిలు అల్లరి చేస్తున్నా.. పిల్లలు తప్పిపోయినా.. ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుంది. శక్తి యాప్‌ను మొబైల్ ఫోన్లలో గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. మొబైల్ నెంబరు యాడ్ చేసి ఓటీపీతో సైన్ ఇన్ కావాలి. ఆపై వచ్చే ఆప్షన్‌లో పేరు, చిరునామా, చరవాణి నెంబరు, లొకేషన్ తదితర వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. కుటుంబ సభ్యులు, బంధువులకు సంబంధించి అందుబాటులో ఉండే రెండు ఫోన్ నెంబర్లు కూడా నమోదు చేయాల్సి ఉంటుంది. అనంతరం యాప్‌లో వచ్చే ఎస్‌వోఎస్ అనే ఆప్షన్‌పై క్లిక్ చేస్తే మొబైల్‌లోని కెమెరా ఆటోమెటిక్‌గా తెరచుకుని 10 సెకన్ల వీడియో రికార్డవుతుంది. ఇది క్షణాల్లో పోలీసు కంట్రోల్ రూమ్‌కు వెళ్తుంది. దీంతో స్థానికంగా ఉన్న పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి రక్షణ కల్పిస్తారు. పిల్లలు తప్పిపోతే మిస్సింగ్ చైల్డ్ రిపోర్టింగ్ ఆప్షన్ ద్వారా ఫిర్యాదు చేసే సౌకర్యం అందుబాటులో ఉంది. యాప్‌లో సేఫ్ జర్నీ, గివ్ ఎ కంప్లైంట్, మిస్సింగ్ చైల్డ్ రిపోర్టు, నైట్ షెల్టర్స్, ఫ్యామిలీ కౌన్సెలింగ్, ఎమర్జెన్సీ కాంటాక్టు తదితర ఫిర్యాదు ఆప్షన్లు ఉన్నాయి.

### శక్తి యాప్‌పై విస్తృత స్థాయిలో అవగాహన

శ్రీకాకుళం పట్టణం, టెక్కలి, కాశీబుగ్గ పట్టణ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను శక్తి బృందాలు సందర్శించారు. శక్తి యాప్ ఆవశ్యకత ప్రాధాన్యత, అందించే సేవలు, ఇతర ఇతర వివరాలు గురించి విస్తృతస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శక్తి యాప్ టీముల ఎస్ఐలు మాట్లాడుతూ ఆపద సమయంలో మహిళలు బాలికలకు ఈ శక్తి యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని, ప్రతి మహిళ విద్యార్థులు బాలికలు మీ యొక్క సెల్ఫోన్లో ప్లే స్టోర్ నందు ఈ యాప్ ను డౌన్లోడ్ చేసుకుని వ్యక్తిగత వివరాలు ఫోన్ నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఎస్ఓఎస్ బటన్, డయల్ 112 నెంబర్ ద్వారా ఫిర్యాదు చేయగా పది నిమిషాల్లో మీ చెంతకు సంబంధిత పోలీస్ అధికారులు చేరుకొని మీ సమస్యను, ఆపదను పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతామని తెలిపారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాలపై డయల్ 100, 112, చైల్డ్ లైన్ 1098, గృహ హింసా 181, మహిళ వేధింపులు 1091, సైబర్ టోల్ ఫ్రి 1930, సైబర్ మిత్ర, సంబంధిత పోలీసు వారికి తక్షణమే సంప్రదించి పోలీసుల సేవలను సద్వినియోగం చేసుకోవడంపై వివరించారు. మహిళలు పోలీసులు విద్యార్థులకు, పాఠశాల మహిళ టీచర్లుకు శక్తి యాప్ యొక్క ఉపయోగాన్ని తెలియజేసి వారి వారి ఫోన్లు శక్తి యాప్ నిక్షిప్తం చేయించి, రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546